రికార్డు స్థాయిలో వరి సాగు

- వేధిస్తున్న యూరియా కొరత
- దిగుబడులపై తీవ్ర ప్రభావం
- ఆందోళనలో అన్నదాతలు


హెచ్ఎల్సీ ఆయకట్టులో సాగైన వరి

రాయదుర్గం: ఈసారి ఖరీఫ్‌లో రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో వరి సాగు విస్తీర్ణం గణణీయంగా పెరిగింది. హెచ్ఎల్సీ ఆయకట్టులోనూ ఎక్కువ మంది రైతులు వరి వైపే మొగ్గు చూపారు. దీంతో మూడు వ్యవసాయ సబ్ డివిజన్ల పరిధిలో సాధరణ సాగు విస్తీర్ణం 11,113 హెక్టార్లు కాగా రికార్డుస్థాయిలో 14,693 హెక్టార్లలో వరి పంట సాగులోకి వచ్చింది. గతేడాది ప్రకృతి విపత్తులు రైతుకు గుండె కోతలు మిగిల్చాయి. వడగళ్ల దెబ్బకు వడ్లు నేలరాలగా, ఏపుగా పెరిగిన గ్రాసం వాటువాలి పొలాల్లోనే కుళ్లింది. ఈ నేపథ్యంలో గత నష్టాలు గట్టెక్కేలా దిగుబడులపైనే అన్నదాతలు ఆశలు పెంచుకున్నారు.

వేధిస్తున్న యూరియా కొరత..

ఖరీఫ్ సాగు ఆరంభం నుంచి వరి రైతులను యూరియా కొరత వేధిస్తోంది. కూటమి ప్రభుత్వం అరకొరగా యూరియా అందిస్తుండడంతో అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. కొన్నిచోట్ల టీడీపీ అనుయాయులే యూరియా పంచుకుంటుండడంతో సాధారణ రైతుకు యూరియా దొరకని దుస్థితి నెలకొంది. అధికారుల గణంకాలేమో ఘనంగా ఉంటున్నా .. క్షేత్రస్థాయిలో మాత్రం యూరియా కోసం తిప్పలు తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. సకాలంలో యూరియా వేయకపోతే దిగుబడులు కోల్పోవాల్సి వస్తోందన్న ఆందోళన కర్షకుల్లో కనిపిస్తోంది. లెక్కలు మాని చిక్కులు తప్పించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వరిసాగు వివరాలు (హెక్టార్లలో)		
నియోజకవర్గం	సాధారణ సాగు	సాగైంది
రాయదుర్గం	9,267	11,759
ఉరవకొండ	1,008	2,138
కళ్యాణదుర్గం	838	796

యూరియా దొరకడం లేదు



హెచ్ఎల్సీ ఆయకట్టులో రైతులకు సరిపడా యూరియా దొరకడం లేదు. యూరియా రావడం మాత్రమే కనిపిస్తోంది. కనీసం సగం క్యూ కూడా పూర్తికాకనే నో స్టాక్ అంటూ బోర్డు పెట్టేస్తున్నారు. ఈ ఏడాది పొలాలు బాగున్నాయి. సరిపడా యూరియా వేస్తే గతేడాది నష్టాలు కూడా పూర్తి చేసుకోవచ్చు. ఎలాగూ ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వలేదు. యూరియా అయినా సక్రమంగా అందించాలి.

– నాగరాజు, రైతు, బొమ్మనహాళ్

సరుకుల పంపిణీలో ఇబ్బంది పెట్టొద్దు


డీలర్లకు ఈ -పాస్ మిషన్లను అందజేస్తున్న ఆర్డీఓ వసంతబాబు

కళ్యాణదుర్గం: ప్రభుత్వం చౌకధాన్య డిపోల ద్వారా అందించే సరుకులను ప్రజలకు ఇబ్బందులు లేకుండా పంపిణీ చేయాలని ఆర్డీఓ వసంతబాబు డీలర్లకు సూచించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గురువారం ప్రభుత్వం పంపిన నూతన ఈ–పాస్ మిషన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్యాణదుర్గం మండలంలోని చౌకధాన్య డిపో డీలర్లందరికీ ఈ పాస్ మిషన్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వినియోగదారుల పట్ల డీలర్లు సఖ్యతగా మెలగాలన్నారు. సమయపాలన పాటించి ప్రభుత్వ నిబంధనల మేరకు సరుకులు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్, సీఎస్డీటీ దుర్గా ప్రసాద్, టెక్నికల్ అసిస్టెంట్ మహమ్మద్, డీలర్లు పాల్గొన్నారు.

ఆహార అనుబంధ ఉత్పత్తులపై అవగాహన


చింతపండు వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న మారుతి

కుందుర్పి: స్థానిక ఐకేపీ కార్యాలయంలో గురువారం సెర్ప్, డీఆర్డీఏ అధికారుల పర్యవేక్షణలో చింత పండు, ఆహార అనుబంధ ఉత్పత్తుల దిగుబడులపై అవగాహన కల్పించారు. స్టేట్ ఆహార సంస్థ మేనేజర్ మారుతి, జిల్లా జీవనోపాధుల విభాగం ప్రాజెక్ట్ మేనేజర్ గంగాధర్ తదితరులు వ్యాపారులు చింత పండు నూర్పిడి తరువాత శీతల గిడ్డంగుల్లో భద్రపరిచే విధానం మార్కెట్ల వివరాలను వెల్లడించారు. చింతపండు తదితర పండ్ల వ్యాపారులకు డీఆర్డీఏ ద్వారా సంబంధిత బ్యాంకుల్లో వడ్డీ లేని రుణాలు ఇచ్చేందుకు సంస్థ సిద్ధంగా ఉందన్నారు. వ్యాపారులు స్థానిక ఐకేపీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎంలు శివప్రసాద్, సద్దానప్ప సమాఖ్య అధ్యక్షురాలు రుక్మిణి, సీసీలు శివన్న, శ్రీనివాసులు, షఫీవుల్లా, గంగాధర తదితరులు పాల్గొన్నారు.

బస్టాండులో కంపు కంపు


బస్టాండులో దుకాణాల ముందు పారుతున్న మురుగు నీరు

కూడేరు: కూడేరు బస్టాండ్‌లో రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన డ్రైనేజీ నుంచి మురుగు నీరు బయటకు వచ్చి దుకాణాల ముందు రోడ్డు పొడవునా ప్రవహిస్తోంది. దీంతో దుకాణాదారులు, ప్రయాణికులు మురుగు కంపును భరించలేక పోతున్నారు. మరోవైపు మురుగు నీటితో దోమలు బెడద ఎక్కువై రోగాల బారినపడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీ నుంచి మురుగు నీరు బయటకు రాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి డిగ్రీ రెండో విడత అడ్మిషన్లు

కళ్యాణదుర్గం: పట్టణంలోని ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ రెండో విడత అడ్మిషన్లను చేపట్టనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.హర్షలత తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. 26వ తేదీ నుంచి 29వ తేదీ వరకూ అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. డిగ్రీ కోర్సుల్లో చేరే విద్యార్థులు స్థానిక ఎస్వీజీఎం కళాశాలలో సంప్రదించి, ఉచితంగా ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు పొందవచ్చన్నారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా


మాట్లాడుతున్న పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అష్రాఫ్‌ఆలీ

ఉరవకొండ: చిన్నమూస్టురులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీఎస్ఎస్‌డీసీ, సీడ్యాప్ ఆధ్వర్యంలో గురువారం జాబ్‌మేళా ఏర్పాటు చేశా. మొత్తం 12 కంపెనీల ప్రతినిధులు హాజరై 89 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ అష్రాఫ్‌ఆలీ మాట్లాడుతూ ఉద్యోగం సాధించవారు అంకిత భావంతో పని చేసి ఉన్నతస్థానాలకు ఎదగాలన్నారు. ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా అధికారి ప్రతాప్ రెడ్డి, సీడ్యాప్ సంస్థ సభ్యులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

పట్టణాన్ని శుభ్రంగా ఉంచుదాం


గాంధీ స్కూల్ వద్ద స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్

రాయదుర్గంటౌన్: పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా పట్టణంలోని సచివాలయాల వారీగా అన్ని వార్డుల్లో గురువారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 1, 10 వార్డుల్లో జరిగిన స్వచ్ఛోత్సవ్ కార్యక్రమానికి చైర్‌పర్సన్, కమిషనర్ హాజరై పార్వతీనగర్, గాంధీ స్కూల్ ఆవరణలో చీపురు పట్టి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో 1వ వార్డు వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ దివాకర్, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

తడిసి ముద్దయిన వేరుశనగ


వడ్డెపాళ్యం సమీపంలో పొలంలో తడిసిన వేరుశనగ

కుందుర్పి: మండల వ్యాప్తంగా కురుస్తున్న చిత్తడి వానలకు వేరుశనగ పంట పొలాల్లోనే తడిసి పనికిరాకుండా పోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వడ్డెపాళ్యం, జంబుగుంపల, నిజవళ్లి, నాగేపల్లి తదితర గ్రామాల్లో రెండు రోజుల క్రితం తొలగించిన వేరుశనగ పొలాల్లోనే తడిపోవడంతో పశువులకు గ్రాసం లేకపోగా కాయలు రంగుమారి మార్కెట్లలో తక్కువ ధరలకు అమ్ముకోవాల్సి ఉందని రైతులు సోమశేఖర్, హనుమయ్య, ఈరన్న,నాగరాజు, శివలింగ తదితరులు వాపోయారు. కోత సమయంలో జడివానలకు వేరుశనగ కట్టితో పాటు కాయలు సైతం మసకబారి ధర పలకడంలేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు.

7,287 హెక్టార్లలో ఈ-క్రాప్ బుకింగ్

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో ఇప్పటికే 7,287 హెక్టార్లలో ఈ క్రాప్ బుకింగ్ అయినట్లు ఏఓ నిర్మల్‌కుమార్ తెలిపారు. మొత్తం సాగు విస్తీర్ణం 12971హెక్టార్లు కాగా 11928 హెక్టార్లలో ఇప్పటి వరకు వివిధ పంటలను రైతులు సాగుచేసినట్లు చెప్పారు.

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం


గ్రామ కమిటీ అధ్యక్షుడిని ఎంపిక చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బ్రహ్మసముద్రం: గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయడానికి కృషి చేద్దామని జిల్లా పంచాయితీరాజ్ విభాగం కార్యదర్శి మంజునాథ, తాలూకా కార్మిక విభాగం అధ్యక్షుడు సంజీవయ్య అన్నారు. గురువారం మండలంలోని వేపులపర్తి గ్రామ పంచాయితీలో స్థానిక ఎంపీటీసీ బూసప్ప అధ్యక్షతన నూతన గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను దారుణంగా మోసంచేసిందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం వేపులపర్తి గ్రామ పంచాయతీ అధ్యక్షుడిగా సన్న లింగమ్మ గారి రంగస్వామితోపాటు 56 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు మహలింగ, శరణప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ రెన్యువల్ చేయాలి


గుండిగానిపల్లిలో ఆర్డీటీకి మద్దతు తెలుపుతున్న ప్రజలు

బ్రహ్మసముద్రం: ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ రెన్యువల్ చేయాలని కోరుతూ మండలంలోని గుండిగానిపల్లి సర్పంచ్ సుజాతమ్మ, ఎస్.కొండాపురం సర్పంచ్ మల్లెల వనిత ఆయా గ్రామ పంచాయతీల తరపున తీర్మానించి ప్రభుత్వానికి వినతిపత్రం పంపారు. ఈ సందర్భంగా సుజాతమ్మ మాట్లాడుతూ ఆర్డీటీ ఎంతో మంది నిరుపేదలకు అండగా ఉంటూ నిస్వార్థంగా సేవలందించిందన్నారు. అటువంటి సంస్థకు ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించి సేవలను కొనసాగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ మాజీ కార్యదర్శి అశోక్‌రెడ్డి, నాగిరెడ్డి, ఆర్డీటీ లబ్ధిదారులు , మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వాహనాల వేలం

కళ్యాణదుర్గం రూరల్: మద్యం కేసుల్లో పట్టుబడిన ద్విచక్రవాహనాలను గురువారం కంబదూరులోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఆవరణలో వేలం వేశారు. 17 ద్విచక్రవాహనాలు, ఒక కారు వేలం వేయగా రూ 2,61,074 రూపాయలు ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు.

కర్ణాటక మద్యం ధ్వంసం..

కంబదూరు మండలం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 60 కేసుల్లో పట్టుబడిన కర్ణాటక మద్యం, 8 కేసుల్లో పట్టుబడ్డ నాటుసారాను ఎక్సైజ్ పోలీసులు ధ్వంసం చేశారు. అసిస్టెంట్ సూపరింటెండెంట్ రేవతి, సీఐ సునీల్ కుమార్, ఎస్ఐ లోకేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ

విడపనకల్లు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి పీహెచ్‌సీ అధ్వర్యంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పుష్ప, డాక్టర్ మస్రత్‌జహ, మలేరియా సబ్ యూనిట్ అధికారి భత్తుల కోదండరామిరెడ్డి ఆధ్వర్యంలో వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది నూర్‌బాషా, శశికళ, గ్రామ కార్యదర్శులు వశికేరి మహేష్, సోమయ్య పాల్గొన్నారు.

ఆదిశక్తీ .. పాహిమాం !


రాయదుర్గం: అన్నపూర్ణేశ్వరిగా వాసవీమాత


రాయదుర్గం: సంతానలక్ష్మీ అలంకరణలో చౌడేశ్వరి


రాయదుర్గం: శాంతినగర్‌లో మహంకాళిదేవి


బొమ్మనహాళ్: శాకంబరిగా కన్యకాపరమేశ్వరి


గుమ్మఘట్ట: కాత్యాయనిగా భద్రకాళి


బెళుగుప్ప: శాకంబరిగా కాత్యాయనిదేవి


గాయత్రీదేవిగా బూదిగుమ్మ పద్మావతి

సాక్షిబృందం: శరన్నవరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. నాల్గవరోజు గురువారం రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని అమ్మ వారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రూపాల్లో అమ్మ వార్లు భక్తులకు దర్శనమిచ్చారు.


కాత్యాయనిదేవిగా ఉరగాద్రి చౌడేశ్వరి


సౌభాగ్య లక్ష్మిగా ఉద్దవ మహాలక్ష్మి


కళ్యాణదుర్గం: సంతానదేవి అలంకరణలో చౌడేశ్వరి


కళ్యాణదుర్గంలో సింహ వాహిగా వాసవీమాత


కణేకల్లు: ముకాంబికగా దుర్గాదేవి


వజ్రకరూరు: కాత్యాయనీగా దర్శనమిస్తున్న మారెమ్మ


వెలిగొండలో బాలా త్రిపుర సుందరిగా భగళాముఖీ దేవి

చంద్రబాబు అంటేనే మోసం, దగా

- మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప


కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైఎస్సార్‌సీపీ నేతలు

రాయదుర్గంటౌన్: 'చంద్రబాబు పాలన అంటేనే.. దగా, నయవంచన, మోసం గుర్తుకువస్తాయి. దీన్ని ప్రజలు కూడా విశ్వసిస్తున్నారు' అని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ మేకల శ్రీనివాసులు, చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొరాళ్ల శివకుమార్ విమర్శించారు. గురువారం పట్టణంలోని 6, 7 వార్డుల్లో వార్డు కౌన్సిలర్ శివపుత్ర, వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ కూటమి ప్రభుత్వ మోసాలను వివరించారు. అనేక ఆంక్షలు, కొర్రీలతో అరకొరగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి, అంతా చేసేశామని మోసం చేస్తున్న తీరును తెలియజేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అన్ని వర్గాల పేదలకు పక్కాగా పథకాలు చేరేవన్నారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదని, అన్ని వ్యవస్థలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసి పేదలను నిలువునా మోసం చేసిందన్నారు. సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ప్రశ్నించాలన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో కౌన్సిలర్లు శారదాదేవి, శివపుత్ర, పొరాళ్ల గోవిందరాజులు, పైతోట సంజీవప్ప, ఫక్రుద్దీన్, ఐనాపురం మంజునాథ, కోప్షన్ సభ్యుడు నజీర్, మాజీ కౌన్సిలర్ రఘురాం, వార్డు ఇన్‌చార్జ్‌లు అరవా శివప్ప, గౌని శ్రీరామిరెడ్డి, సునార్ ఇస్మాయిల్, రామాంజనేయులు, కృష్ణమూర్తి, దివాకర్, ప్రచార కార్యదర్శి తిప్పేస్వామి, బడిగి బషీర్, జలంధర్‌రెడ్డి, బంగి రమేష్, చంద్రశేఖర్‌రెడ్డి, పైతోట రాజు, కొలిమి ఆనంద్, ప్రవీణ్, రవికుమార్, చాకలి మధు, బుట్టశాంత, పునీత్ కుమార్, సత్తి, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

రైతులను నిండాముంచిన 'కూటమి'

కళ్యాణదుర్గం రూరల్: కూటమి ప్రభుత్వం రైతులను నిండాముంచుతోందని, పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించకుండా నిర్లక్ష్యం చేస్తోందని ఏపీ రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి బీహెచ్ రాయుడు, సీఐటీయూ నాయకుడు రంగనాథ్ మండిపడ్డారు. గురువారం పట్టణంలోని ధర్మవరం రోడ్డు వద్ద ఉన్న టమాట మండిలో వారు ధరలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ... మొన్న మిర్చి, చీని, అరటి, పొగాకు, మామిడి రైతులు, నిన్న బొప్పాయి ఉల్లి రైతులు, నేడు టమాట రైతులు గిట్టుబాటు ధరలు లభించక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవడంలో విఫలం అయ్యారన్నారు. కిలో టమోటకు రూ. 25 మద్దతు ధర కల్పించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వలు రైతులకు ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించాలి


కురాకులపల్లిలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కళ్యాణదుర్గం రూరల్: చంద్రబాబు మోసపు పాలనను ప్రజలకు వివరించాలని కంబదూరు మండల పట్టణ, రూరల్ కన్వీనర్లు వెంకటప్ప, హనుమంతురాయుడు సూచించారు. గురువారం మండలంలోని కురాకులపల్లిలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమమ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు కేవలం టీడీపీ కార్యకర్తలకు మాత్రమే దక్కుతున్నాయన్నారు. అనంతరం కురాకులపల్లి లో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు వెంకటేశులు, ఎంపీటీసీ నాగరాజు, నాయకులు భీమేష్, నరసింహులు, రవి, గోపాల్, వన్నప్ప, రామాంజనేయులు, అక్కులప్ప పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కుందుర్పి: సీజినల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు తరుణ్‌సాయి, సోమేష్‌కుమార్, నారాయణస్వామి సూచించారు. గురువారం మలయనూరు పంచాయతీలోని ఐదు గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలుతున్న తరుణంలో జిల్లా వైద్యశాఖ సూచనల మేరకు మలయనూరులో వైద్య శిబిరం నిర్వహించి 250 మంది రోగులకు చికిత్సలు అందించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మధుబాబు, శాంతవేణి, మమత, లతీష్, ఆశా సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

కణేకల్లు: స్థానిక బస్టాండ్‌లో ఓ దుకాణానికి వచ్చిన గ్రానైట్ బండలను అన్‌లోడ్ చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తూ గ్రానైట్ బండ పడి సలాం అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. లారీలో నిల్చొని గ్రానైట్ బండను తీసి కిందకు అన్‌లోడ్ చేస్తున్న సమయంలో ఈ ఘటన జరిగినట్లు స్థానికులు తెలిపారు. క్షతగాత్రుడిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అనారోగ్యంతో మాజీ ఉపసర్పంచ్ మృతి


జిలకర మోహన్(ఫైల్)

ఉరవకొండ: ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీ మాజీ ఉపసర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత జిలకర మోహన్(64) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. నెల రోజుల క్రితం జిలకరమోహన్ సతీమణి వసుంధర వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తూ అనారోగ్యంతో మృతి చెందింది. తాజాగా మోహన్ మృతి చెందడంతో వారి కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వర రెడ్డి మోహన్ మృతి పై ప్రగాఢ సానుభూతి తెలియచేశారు.

అనాథకు అంత్యక్రియలు

ఉరవకొండ: స్థానిక విఠల్ రుక్మిణి వృద్ధాశ్రమంలో ఆనంద్(65) అనే వృద్ధుడు మృతి చెందాడు. ఆయనకు బంధువులు ఎవరూ లేకపోవడంతో ఆపద్బాంధవ ట్రస్టు వారు వృద్ధుడి అంత్యక్రియలు గురువారం స్థానిక వెలిగొండ రోడ్డు వద్ద ఉన్న హిందూ శ్మశాన వాటికలో నిర్వహించారు. ట్రస్టు సభ్యులు వేల్పుల మురళి, సంఘసేవకులు లెనిన్‌బాబు, అనిల్‌రెడ్డి, నవీన్, భీమేష్, వివేకానంద, అశోక్, నూర్‌బాష, యశ్వంత్, రమేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

27న పుస్తక పరిచయ సభ

కళ్యాణదుర్గం: స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఈ నెల 27న అగ్రహారం బిక్కి నాగమ్మ స్మారక సేవా సమితి ఆధ్వర్యంలో పుస్తక పరిచయ సభ నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు, విశ్రాంత ఉప సంచాలకుడు, కవి, రచయిత అగ్రహారం సత్యనారాయణ తెలిపారు. అతిథులుగా ప్రముఖ కవి, సాహితీ విమర్శకుడు డాక్టర్ రాజారామ్ తూముచెర్ల, కవి ఎస్.గంగప్ప, అష్టావధాని గురువేపల్లి నరసింహులు, తదితరులు హాజరవుతారన్నారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

స్వచ్ఛతలో భాగస్వాములు కండి

వజ్రకరూరు: స్వచ్ఛతాహీసేవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డీఎల్‌డీఓ విజయలక్ష్మి సూచించారు. గురువారం మండల కేంద్రంలో సర్పంచు మోనాలిసా అద్వార్యంలో కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

బ్రహ్మసముద్రం: మండల అభివృద్ధి అధికారిగా ఎం.ఉమాదేవి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ అనంతపురం జిల్లా పరిషత్ కార్యాలయంలో పరిపాలన అధికారిగా పనిచేస్తూ.. పదోన్నతిపై వచ్చానన్నారు. మండలంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది నూతన ఎంపీడీఓకు శుభాకాంక్షలు తెలిపారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

బెళుగుప్ప: మండల కేంద్రంలోని రామేశ్వరాలయం వద్ద గ్రామానికి చెందిన శారదా కాన్వెంట్ కమిటీ సభ్యులు ఆర్డీటీ సంస్థ సంయుక్తంగా ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను గురువారం ప్రారంభించారు. ఆర్డీటీ సంస్థ రూ.4.6 లక్షలు, శారదా కాన్వెంట్ సభ్యులు రూ.5.5 లక్షలతో ప్లాంట్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డీవైఈఓ మల్లారెడ్డి, స్థల దాత రాజశేఖర్‌రెడ్డి, శారదా కాన్వెంట్ సభ్యులు రిటైర్డ్ ఉపాధ్యాయులు వెంకటేశులు,ఈశ్వరప్ప, శ్రీనివాసరెడ్డి, ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.